# శిల్పారామంలో సుందరీమణులు సందడి

**-బతుకమ్మ ఆడిపాడిన సుందరీమణులు**





హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త

నగరంలోని శిల్పారామంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందడి చేశారు. అక్కడ కలియ తిరుగుతూ వివిధ స్టాళ్లను పరిశీలించారు. విక్రయిస్తున్న పలు వస్తువుల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల ఉత్పత్తులను గురించి అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ ఆడి సందడి చేశారు. అంతకు ముందు శిల్పారామం వద్ద పలువురు కళాకారులు, చిన్నారులు సంప్రదాయ రీతిలో వారికి స్వాగతం పలికారు. శిల్పారామం పర్యటన తర్వాత.. సరూర్ నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ అనాథాశ్రమాన్ని ప్రపంచ సుందరీమణులు సందర్శించనున్నారు. ఇక.. మిస్ వరల్డ్ పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. టీ హబ్ లో నిర్వహించిన హెడ్ టు హెడ్ చాలెంజ్‌లో నాలుగు ఖండాల నుంచి 24 మంది విజేతలుగా నిలిచారు. టాప్ 24లో మిస్ ఇండియా నందిని గుప్తా చోటు దక్కించుకున్నారు. అమెరికన్, కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఏషియా, ఓసియానా ఖండాల వారీగా తదుపరి రౌండ్‌లకు విజేతలను ఎంపిక చేయనున్నారు. ఖండాల వారీగా టాప్‌లో నిలిచిన వాళ్లకు ఈ నెల 31న జరిగే మిస్ వరల్డ్ ఫైనల్ పోటీలో చోటు దక్కనుంది.

# సిద్ధమైన మెట్రో రెండో దశ డిపిఆర్‌లు

**-ప్రభుత్వ పరిశీలనలో**
**మేడ్చల్,శామీర్‌పేట్, ఫ్యూచర్ సిటీ మెట్రో**
**-86.1 కి.మీ పొడవు-రూ.19,579 కోట్ల అంచనా వ్యయం**
**-స్పష్టం చేసిన మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి**



హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త

మేడ్చల్, శామీర్ పేట్, ఫ్యూచర్ సిటీ మెట్రో రైల్ డీపీఆర్‌ల రూపకల్పన విషయంపై హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. మెట్రో రెండో దశ(బి)కి సంబంధించిన డీపీఆర్‌లు పూర్తి స్థాయిలో తయారయ్యాయని, వీటిని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఈనెల 8వ తేదీ ఆమోదించిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు డీపీఆర్‌లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లభించే వరకు వీటికి సంబంధించిన కొన్ని అంశాల విషయంలో గోప్యత పాటించాల్సి ఉంటుందని, అందువల్ల పూర్తి వివరాలు అందించలేక పోతున్నామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు జేబీఎస్‌ను ఒక అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు డీపీఆర్‌లో పలు అంశాలను పొందుపరిచామని తెలిపారు. రు.19,579 కోట్ల అంచనా వ్యయంతో 86.1 కి.మీ పొడవు గల జేబీఎస్‌మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్, ఎయిర్‌పోర్ట్ ఫ్యూచర్ సిటీ మెట్రో ఫేజ్॥ (బి) కారిడార్ల ప్రతిపాదనలతో డీపీఆర్‌లను పూర్తి చేయడం జరిగిందని అయన వెల్లడించారు. జేబీఎస్ స్టేషన్- మేడ్చల్ మార్గం 24.5 కిలోమీటర్లు, 18 స్టేషన్లతో పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌గా ఉంటుందని తెలిపారు. అలాగే జేబీఎస్ స్టేషన్-శామీర్‌పేట్ మార్గం 22 కిలోమీటర్ల కారిడార్ 14 స్టేషన్లతో నిర్మాణం అవుతుందని చెప్పారు. ఈ మార్గం 20.35 కి.మీ ఎలివేటెడ్ గాను, 1.65 కిలోమీటర్లు భూగర్భ మార్గం గాను ఉంటుందన్నారు. హకీంపేట విమానాశ్రయం సమీపంలో ఈ భూగర్భ మార్గం ఉంటుందని మెట్రో ఎండీ చెప్పారు. ఆర్జీఐఏఫ్యూచర్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లుండగా దీనిలో ఎయిర్ పోర్ట్ నుండి 1.5 కి.మీ భూగర్భ మార్గం గాను; 21 కి.మీ ఎలివేటెడ్ గాను, 17 కి.మీలు ఎట్ గ్రేడ్ గాను ఉంటుందన్నారు. ఇది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి పెద్ద గోల్కొండ, రావిర్యాల్ మీదుగా స్కిల్స్ యూనివర్సిటీ వరకు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఇతర రాష్ట్రాలలో మెట్రో రైల్ నిర్మాణ అంచనాలు, హైదరాబాద్ లో ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రెండవ దశ (బి) డీపీఆర్ లను సమగ్రంగా రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ డీపీఆర్‌లను ఆమోదించి, కేంద్రానికి సమర్పించాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

## అత్యాచారానికి పాల్పడిన యువకుడి అరెస్టు

**-రెండేళ్లుగా పోలీసుల గాలింపు**



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ పోలీసులు

కుత్బుల్లాపూర్, మే 22 ప్రభాతవార్త

మైనర్ బాలికను మాయమాటలతో నమ్మించి విశాఖపట్నం తీసుకుని వెళ్లి రెండు రోజులపాటు అత్యాచారం చేసి రెండేళ్లక్రితం పారిపోయిన ఓ యువకుడిని బాలాగనర్ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ పోలీసు డిప్యూటీ కమిషనర్ డి.సురేశ్‌కుమార్ , బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ పి.నరేశ్‌రెడ్డి, బాలానగర్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ టి. నర్సింహ్మారాజుతో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాలానగర్ పరిధి వినాయకనగర్‌కు చెందిన ఓ పదకొండేళ్ల ఐదవతరగతి పూర్తయిన ఓ మైనర్ బాలికను జవహార్‌నగర్ యాప్రాల్‌కు చెందిన రాబిన్‌సన్ డికార్నల్ అలియాస్ లక్కి (23) ప్రేమపేరుతో ముగ్గులోకి దింపి మాయమాటలతో నమ్మించాడు. ఎక్కడికైనా వెళ్లి ఎంజాయ్‌చేస్తే చాలా బాగుంటుందని నమ్మించి ఆ బాలిక ఇంట్లోనుండి డబ్బులు తీసుకువస్తే ఎక్కడికైనా వెళ్లవచ్చని ప్రేమ ఎంత బాగుంటుందో తెలుపుతానని రెచ్చగొట్టాడు. దీనితో ఆతడి మాయమాటలను పూర్తిగా నమ్మిన బాలిక తన ఇంట్లో వున్న రు.లు.30వేల రూపాయలను దొంగిలించి అనుకున్న పథకం ప్రకారం సికింద్రాబాద్‌కు వచ్చి విశాఖపట్నంకు వెళ్లారు. అక్కడ రెండురోజులపాటు లాడ్జిలో మైనర్ బాలికపై అత్యాచారం చేసి తిరిగి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు తీసుకువచ్చి వదిలి పారిపోయడు. దీనితో అయోమయానికి గురైన బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో తల్లిదండ్రులు బాలికను తీసుకుని బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుండి పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న రాబిన్‌సన్ డి-కార్నల్ సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఆనారోగ్యంతో బాధపగుతున్న తన నానమ్మను చూసేందుకు రాగా ఖచ్చినతమైన సమాచారంతో అతడిని అదుపులోకి తీసుకుని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డిప్యుటీ పోలీసు కమిషనర్ సురేశ్‌కుమార్‌తోపాటు బాలానగర్ అడినషల్ డిసిపి సత్యనారాయణ, సహయ పోలీసు కమిషనర్ పి. నరేశ్‌రెడ్డి, బాలానగర్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ టి.నర్సింహ్మారాజు, ఎస్ఐ వినోద్‌కుమార్, ఇఫ్ఫతాకర్, సి.హెచ్.క్రిష్ణయ్య, ఎం.డి.ఖాదర్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

అత్తాపూర్ మే22,ప్రభాతవార్త :


అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తేజస్విని నగర్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో అనుమానస్పద మృతి కలకలం రేపింది. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న గోపాల్ (55) అనే వ్యక్తి రాత్రి సమయంలో అందరూ నిద్రపోయాక ఫ్యాన్ కు ఉరి వేసుకొని బలవర్మణానికి పాల్పడ్డాడు. తల్లి లేచి చూడా కోడుకు ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించడంతో కిందకి దింపి చూడాగా మరిణించాడు. స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన చేరుకొని పోస్టుమాన్ నిమిత్తం మృతదేహన్ని ఉస్మానియాకు తరలించారు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో డ్రైవర్ ఆత్మహత్య ....

ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరిసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.... అత్తాపూర్ పరిధిలోని 9.నంబర్ సెట్విన్ కాలనీలో సులేమా న్ అనే ఆటో డ్రైవర్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందించ డంతో సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పశువుల వాహనాలను ప్రభుత్వ అధికారులే తనిఖీ చేస్తారు


**- ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు**
**- పోలీసుల సమన్వయ సమావేశంలో సిపి సివి ఆనంద్**



బక్రీద్ పండుగ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ సిపి సివి ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు సిపి విక్రమ్‌సింగ్‌మాన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర అధికారులు

హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త


రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని, హైదరాబాద్ నగరంలో శాంతియుత వాతావరణంలో, నగరాన్ని పరిశుభ్రంగా పెడుతూ పండుగను జరుపుకోవడానికి హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ అధ్యక్షతన గురువారం బషీర్‌బాగ్‌లోని పాత పోలీసు కమిషనర్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సిపి లా అండ్ ఆర్డర్ విక్రమ్‌సింగ్ మాన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు మిషనర్ సి రమేష్, అడిషనల్ కమిషనర్ హెల్త్ రఘుప్రసాద్, అడిషనల్ కమిషనర్ సానిటేషన్ డాక్టర్ సిహెచ్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, సరైన వెటర్నరీ సర్టిఫికెట్లు లేని, వధకు సిద్ధంగా లేని పశువులను అక్రమంగా తరలించడాన్ని నిరోధించడానికి హైదరాబాద్ నగర కమిషనరేట్ చుట్టూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను స్వాధీనం చేసుకుని, జీహెచ్ఎంసీ నిర్దేశించిన పశువుల హోల్డింగ్ పాయింట్లు లేదా గోశాలలకు తక్షణమే పంపించాలని ఆదేశించారు. పశువులను తీసుకెళ్లే వాహనాలను ఆపడం లేదా తనిఖీ చేయడం ప్రభుత్వ అధికారులు, చట్టం అమలు చేసే సంస్థలు మాత్రమే చేయాలని, ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. పశుసంవర్ధక శాఖ, జీహెచ్ఎంసీ అన్ని చెక్‌పోస్టుల వద్ద 24/7 వెటర్నరీ డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడాలని కోరడం జరిగింది. పశువుల వ్యర్థాలను సమర్థవంతంగా సేకరించడం, పారవేయడం కోసం తగినన్ని వాహనాలు, టిప్పర్లు మరియు జేసీబీలను సమకూర్చాలని, బక్రీద్ సందర్భంగా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తొలగించడానికి సరిపడే సిబ్బందిని నియమించాలని కోరారు. విద్యుత్ మరియు ఇంజినీరింగ్ శాఖ పండుగ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ మాట్లాడుతూ వార్డులు, మసీదుల సమీపంలో అదనపు పారిశుధ్య బృందాలు, చెత్త సేకరణ వాహనాలను మోహరించడంతో సహా అమలు చేస్తున్న విస్తృతమైన పారిశుధ్య చర్యలను వివరించారు. నిరంతర సమన్వయం, అధికారుల చురుకైన చర్యల వలన ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించడానికి ఈ సమన్వయంతో కూడిన యంత్రాంగం ఎంతగానో దోహదపడుతుందని, తద్వారా నగర వాసులు అందరు బక్రీద్‌ను సాఫీగా, సురక్షితంగా మరియు ఆనందదాయకంగా జరుపుకోవడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు.



# హైదరాబాద్ వార్త

## అత్యవసర పరిస్థితిలో కనిపించని ఎఫ్ఎన్ఎ, ఎంఎన్ఎలు

**-అందుబాటులో ఉండని స్ట్రెచర్‌లు, వీల్‌చైర్‌లు**
**-స్ట్రెచర్ కవాలంటే డిపాజిట్ చేయాలి**
**-అత్యవసర స్థితిలో కూడా అందని కనీస సేవలు**



**హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో తీవ్ర అనారోగ్య పరిస్థితిలో వచ్చిన రోగులకు తిప్పలు తప్పడం లేదు. నడవలేని, కూర్చోలేని పరిస్థితిలో రోగులకు అందుబాటులో ఉండాల్సిన స్ట్రెచర్‌లు, వీల్‌చైర్‌లు అవసరమైన మేరకు లేని కారణంగా రోగులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. అత్యవసర సమయంలో కూడా కొన్నిసార్లు వాటికోసం ఎదురుచూడాల్సివస్తోంది. స్ట్రెచర్ అవసరవమైన రోగులకు సిబ్బందే వాటిని తెచ్చి రోగులకు పడుకోబెట్టే సమయంలో రోగి అటెండర్‌లకు సహకరించాల్సి ఉంటుంది. కాని గాంధీ ఆస్పత్రిలో రోగితో పాటు వచ్చిన అటెండర్‌లే అన్నీ సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వైద్యం కోసం తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల నుంచి కూడా వస్తుంటారు. ప్రతిరోజు దాదాపు రెండు వేల మంది రోగులు గాంధీ ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. ఇలా వచ్చే రోగులను స్ట్రెచర్పై తీసుకుపోయే నాథుడు కూడా లేదు. రోగితో వచ్చిన సహాయకుడే వార్డు వరకు స్ట్రెచర్పై పడుకోబెట్టుకొని తీసుకువెళ్లే పరిస్థితి.

**ఏదైనా డిపాజిట్ చేస్తేనే....**

పేదలు, నిరుపేదలే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. అత్యవసర సమయంలో వచ్చే రోగులకు అస్పత్రి సిబ్బంది తక్షణమే స్ట్రెచర్ ఏర్పాటు చేసి రోగిని వైద్యుల వద్దకు తరలించాల్సి ఉంటుంది. కాని గాంధీ ఆస్పత్రిలో ఈ పరిస్థితి లేదు. రోగితో పాటు ఉండే సహాయకులు వచ్చి సిబ్బందిని సంప్రదించాల్సి వస్తోది. స్ట్రెచర్ కావాలంటే అది ఏర్పాటు చేయడం కోసం రోగివెంట ఉండే సహాయకులు సెల్‌ఫోన్ లేదా ఇతర విలువైన వస్తువులు డిపాజిట్ చేస్తేనే స్ట్రెచర్‌లు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైద్యులు రోగిని పరిక్షించి రోగిని అడ్మిట్ చేయాలనుకుంటే ఏ వార్డులో అడ్మిట్ చేయాలో సూచిస్తారు. అక్కడే ఉండే సిబ్బంది అడ్మిట్ చేయాల్సిన వార్డు ఏ అంతస్తులో ఉందో రోగి సహాయకులకు తెలిపి తీసుకువెళ్లాల్సిందిగా సూచిస్తారు. సూచించిన వార్డులో చేర్చిన అనంతరం రోగి సహాకులే స్ట్రెచర్‌ను తీసుకువచ్చి అప్పగించి డిపాజిట్ చేసిన వస్తువును తీసుకువెళ్ళాల్సి ఉంటుందని ఆరోపిస్తున్నారు. స్ట్రెచర్ కావాలంటే కూడా ఏదైనా షూరిటీ పెట్టాలంటూ సిబ్బంది పెట్టే వేధింపులకు వైద్యం కోసం వచ్చిన వారంతా బిక్కుబిక్కుమంటున్నారు.

**అందుబాటులో ఉండని ఎఫ్ఎన్ఎ, ఎంఎన్ఎలు....**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్సలు పొందడానికి ఎంతో నమ్మకంతో దూరప్రాంతాల నుంచి వస్తుంటారు. తమ ప్రాణాలను కాపాడాతారని అశలతో ఆస్పత్రిని ఆశ్రయిస్తారు. కాని ఇక్కడ అందుబాటులో ఉంటే సౌకర్యాలు చూసి రోగులు ఆందోళన వ్యక్తం చేస్తుంటారు. 1200 పడకల సామర్థం కలిగిన ఈ ఆస్పత్రిలో 27 విభాగాల్లో నిత్యం వైద్యసేవలందుతుంటాయి. వివిధ జిల్లాల్లో వైద్య సేవలు పొందుతున్న రోగులకు మెరుగైన వైద్యం అవసరమైన పక్షంలో ఆయా ప్రాంతాల నుంచి అక్కడి వైద్యులు గాంధీ ఆస్పత్రికి తరలించాలని సూచిస్తారు. గాంధీలో సత్వర వైద్యమందుతుందని ఆశలో వచ్చే వారికి ఇక్కడ నిరాశే మిగులుతుంది. సాధారణంగా ఎఫ్ఎన్ఎ, ఎంఎన్ఎలు అంబులెన్స్‌ల వద్దకు వచ్చి స్ట్రెచర్‌లు, వీల్‌చైర్‌లు తీసుకువచ్చి రోగిని దించాలి. కాని ఇక్కడ వారి జాడకూడా కనిపించదు. వైద్య పరీక్షలు జరిపించిన అనంతరం అడ్మిట్ చేయాల్సి వార్డులోకి కూడా ఎఫ్ఎన్ఎ, ఎంఎన్ఎలు స్వయంగా రోగిని తీసుకువెళ్లాలి కాని రోగి సహాయకులే తీసుకువెళుతున్నారు. వార్డుల వివరాలు తెలియక వారు తికమకపడుతుంటారు. కనిపించిన వారిని అడుగుతూ వార్డులలోకి తరలిస్తున్నారు. ఎఫ్ఎన్ఎ, ఎంఎన్ఎలు అందుబాటులో ఉండకపోవడం వల్ల రోగితో పాటు వచ్చిన సహాయకులే చేసేదేమి లేక ఆసుపత్రిలోపలికి వెళ్లి స్ట్రెచర్ తీసుకొచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఆలోపు పరిస్థితి విషమించి పేషెంటు మరణిస్తే అంతే సంగతి.

**సహాయం పొందాలంటే చేయి తడపాల్సిందే....**

అన్ని రకాల ఇబ్బందులను అధిగమించినప్పటికి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వచ్చి కొంతమంది సిబ్బంది డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. రోగి సహాయకులు మందులు కొనుక్కురావడానికో, లేదనా వైద్యులను సంప్రదించడం, ఇతర అవసరాలకు వెళ్లిన సమయంలో రోగికి బాత్‌రూమ్ లాంటి వెళ్లడానికి సహకరించాల్సిందిగా కోరితే నాకు చాయ్ తాగడానికి ఇవ్వాలని, టిఫిన్ చేయడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. రోగులకు ఇబ్బంది కలిగి బెడ్‌షీట్ మార్చాలన్నా, రోగికి ఇతర అవసరాలు తీర్చాలన్నా చేయి తడపనిదే పనులు కావడం లేదని ఆరోపిస్తున్నారు. రోగి కోలుకొని ఇంటికి వెళ్లే సమయంలో కూడా నలుగురు, అయిదుగురు సిబ్బంది వచ్చి డబ్బులు కావాలలని డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. రోగి సహాయం కోరినప్పుడు చీదరించుకొని, విసుక్కోని తీరా ఇంటికి వెళుతుంటే మాత్రం చేయిచాచడం పట్ల రోగులు వింతగా చూస్తుంటారు.

## ఇన్వర్టర్‌లో ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్..!


**-గుల్జార్‌హౌస్ ప్రమాదానికి అసలు కారణమని**
**-నిర్ధారించిన ఫైర్ అధికారులు**



హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :

గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాద ఘటనపై అసలు నిజాలను బయటపెట్టారు ఫైర్ అధికారులు. ఇన్వర్టర్‌లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే గుల్జార్ హౌస్‌లో మంటలు చెలరేగినట్లు అధికారులు నిర్ధారించారు. అగ్ని ప్రమాదం జరిగిన టైంలో ఇంట్లో రెగ్యులర్ కరెంట్ ఆఫ్‌లో ఉందని.. ఇన్వర్టర్ ద్వారా సెకండరీ పవర్ సప్లై మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌తో పాటు నాగపూర్‌కు చెందిన ఫైర్ ఫోరెన్సిక్ ఇంజనీర్లు నిర్ధారించారు. ఫైర్ ఎక్స్‌పర్ట్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి పూర్తి నివేదికను ఫైర్ డీజీకి అందించనున్నారు. మరోవైపు అగ్ని ప్రమాదం జరిగాక పొగ ఎక్కువ అవడంతో కుటుంబ సభ్యులు బయటకి రాకుండా రూమ్‌లోనే ఉండి తలుపులు వేసుకున్నారు. దీంతో పొగను పీల్చి ఊపిరి ఆడకుండా పడిపోయారు. ఈ ప్రమాదంలో ఊపిరి ఆడక పోవడం వల్లే వారంతా చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. త్వరలో ఘటన స్థలానికి ఓఎన్‌జీసీ కంపెనీ బృందాలు వెళ్లనున్నాయి. ఈనెల 18,ఆదివారం తెల్లవారుజామున పాతబస్తీలోని గుల్జార్ హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవనంలోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. గత కొన్నేళ్లుగా ప్రహ్లాద్ మోదీ తన కుటుంబ సభ్యులతో కలిసి గుల్జార్ హౌస్‌లో నివాసం ఉంటున్నారు. ముందు రోజు ఓ వేడుకకు హాజరైన కుటుంబసభ్యులు అంతా కలిసి ఇంట్లోనే నిద్రించారు. ప్రమాద సమయంలో మొత్తం 21 మంది ఉన్నారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబసభ్యులు నిద్రలో ఉన్నారు. దీంతో ప్రమాద తీవ్ర పెరిగింది. మంటలు వ్యాపించి, దట్టమైన పొగ వ్యాపించడంతో గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకు వెళ్లేందుకు పరుగులు తీశారు. అయితే ఆ భవనంలోకి వెళ్లేందుకు ఒకే మార్గం ఉండటం.. అక్కడ మంటలు వ్యాపించడంతో వారు తిరిగి పైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడ కూడా మంటలు చెలరేగడంలో ఇంట్లో గదిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నారు. దట్టమైన పొగ వ్యాపించడంతో గదిలో ఉన్న వారు ఊపిరి ఆడక అల్లాడిపోయారు. ఆ తరువాత అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కూడా ఇంట్లోని వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చి ఇంట్లోకి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మొత్తం 21 మందిలో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. కాగా, ఒక్కొక్కరు ఒక్కో కారణాలు చెబుతున్నారు. ఇరుకైన ప్రదేశంలో ఏడు ఏసీల నిరంతర వాడకం వల్లనే ప్రమాదం జరిగిందని, ఏసీ ఎగ్జాస్ట్‌కు సరైన సౌకర్యం లేకపోవడంతో కంప్రెషర్ పేలినట్లు..విద్యుత్ అక్రమ వాడకం..ఏసీ కంప్రెషన్‌లో సిలెండర్ పేలుడు, హైలోడ్‌కు తగినట్టుగా కేబుల్ సిస్టమ్ లేకపోవడం, ఇన్వర్టర్ లోపం ..ఇలా పలు కారణాలతో ప్రమాదం జరిగినట్టు నిర్ధారణకు వచ్చాయి దర్యాప్తు బృందాలు. గుల్జార్ హౌస్ అగ్నిప్రమాద ఘటనపై కమిటీకి తుది నివేదిక సిద్ధం చేసింది. చార్మినార్ పోలీస్, ఫైర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్స్, ఫోరెన్సిక్ , వీటిబిదితో పాటు నాగ్‌పూర్ నిపుణుల బృందం విచారణ జరిపారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



తార్నాక గణేష్ టెంపుల్లో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కిషన్‌రెడ్డి

**తార్నాక, మే 22 ప్రభాతవార్త :** హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని తార్నాక లోని గణపతి టెంపుల్లో బిజేపీ నాయకులు బండ శివారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆంజనేయుని ప్రత్యేక పూజ లో ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసిన, అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో స్థానికులతో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భోజనం చేశారు. అంతకంటే ముందుగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ తరపున ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆంజనేయుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. జయంతి వేడుకలో బండ కార్తీక రెడ్డి మాజీ మేయర్, రాష్ట్ర బిజెపి నాయకుడు మర్రి శశిదర్ రెడ్డి. మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచందర్‌రావు, బండ చంద్రా రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకుడు,ఆనంద్ రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు, గౌతమ్ రావు, భరత్ గౌడ్ జిల్లా అధ్యక్షుడు, యాది రెడ్డి ఆర్ఎస్ఎస్, రాజశేఖర్ రెడ్డి, వెంకటరమణితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
### న-అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ముషీరాబాద్, మే 22, ప్రభాతవార్త:** నూతనంగా ప్రారంభిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. గురువారం నల్లకుంట డివిజన్ సంజయ్‌గాంధీ నగర్ లో 19 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపర చేందుకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేయించి, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు మేడి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో రాధారెడ్డి ప్రత్యేక పూజలు


దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష డైరెక్టర్ పి.రాధారెడ్డి, డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి దంపతులు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం జిబిఎస్ టెంపుల్‌లో పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష డైరెక్టర్ పి రాధారెడ్డి, డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు రాధారెడ్డి, రవిశేఖర్ రెడ్డి దంపతులకు స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆంజనేయ స్వామికి ఇష్టమైన వడమాల,తమలపాకులు, స్వీట్స్,పండ్లను స్వామివారికి సమర్పించారు. కార్యసిద్ధి ప్రతీక, సంకటమోచకుడు హనుమాన్ అనుగ్రహం ఉండాలని వేదపండితులు దంపతులను ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు.కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ శ్రీరామ్‌మూర్తి , వేదపండితులు లక్ష్మణ బృందం, జగదీశ్,నాగరాజు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడు భాగ్యరెడ్డి వర్మ ఆశయ సాధనకు కృషి చేయాలి
### - బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



తెలంగాణ ఉద్యమ నేత భాగ్యరెడ్డి జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్న బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, మే 22 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ నేత, దళిత చైతన్యానికి వేగుచుక్క మదిరి భాగ్యరెడ్డి ఆశయ సాధనకు నేటి యువత నడుం బిగించాలని బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. గురువారం బండ్లగూడ కార్యాలయంలో భాగ్యారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ తెలంగాణ తొలితరం ఉద్యమంలో భాగ్యారెడ్డి యువతలో నింపిన స్ఫూర్తి అమోఘమన్నారు. తెలంగాణ బిడ్డలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, నీటి పారుదల, నిధుల విడుదల వంటి రంగాలలో జరుగుతున్న అన్యాయంను గ్రామ గ్రామాన తిరిగి వివరించి, ప్రజలను చైతన్యపరిచారన్నారు. ఆయన పిలుపుకు ఆకర్షితులై ఉన్న విద్యార్థులు ఉప్పెనలా ఉద్యమంలో దూకారని, ఆనాడు ఉద్యమం ఉవ్వెత్తున లేవడానికి భాగ్యారెడ్డి కృషి దాగుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ యాదయ్య, మేనేజర్ మంజులత, ఆర్ఓ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైస్తవుల సమగ్రాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తా


తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్(టియుసిపిఎ) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** క్రైస్తవుల సమగ్రాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్(టియుసిపిఎ) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ అన్నారు. గురువారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని అసోసియేషన్ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ క్రైస్తవ ప్రముఖ నాయకులు వినోద్, కరుణాకర్, హితేష్‌లు కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. గోనెసాల్మన్‌రాజ్ అసోసియేషన్ మరింత బలోపేతం అవడానికి అవకాశాలున్నాయన్నారు. ఈ సందర్భంగా గోనె సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2వేల మంది పాస్టర్లకు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాస్టర్లందరు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. క్రిస్టియన్ మైనారిటీలను బిసి(సి)లో చేర్చాలని, క్రిస్టియన్ మైనారిటీ ప్రొటెస్టెంట్స్‌లకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్య ఇవ్వాలని, అదే విధంగా క్రిస్టియన్ స్మశానవాటికలకు అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేలా భూములను కేటాయించాలని, రూ.5లకే యూనిట్ విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.


బండ్లగూడ గ్రామం మాజీ సర్పంచ్ బొర్ర వెంకటేష్ ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీపీ, మాజీ కార్పొరేటర్ అనిత ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నేత గోపాల్ ముదిరాజ్ తదితరుల దృశ్యం.


ఈస్ట్ మారేడ్‌పల్లి హన్‌మాన్ దేవాలయంలో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు


అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి


జయంతి వేడుకలో భక్తులు


కౌసల్య కాలనీలో వెంచేసి ఉన్న శ్రీ వెంకట శివ రామాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకం చేస్తున్న ఆలయ ధర్మకర్త 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్

# వైభవంగా హనుమన్ జయంతి వేడుకలు

**ఈస్ట్ మారేడ్‌పల్లిలో**
**కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:** హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని ఈస్ట్ మారేడ్‌పల్లిలోని భక్త హన్‌మాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ ఉత్సవాలకు మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక బిజెపి మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ కొంతం దీపిక ప్రారంభించారు.

**నిజాంపేట్‌లో..**
**నిజాంపేట్, మే 22, ప్రభాతవార్త :** నిజాంపేట్ రోడ్ అంబేద్కర్ విగ్రహం నందు పోచమ్మ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బి నాగేష్, బి రవికుమార్, ఎన్ రవీందర్, బి సత్యం, బి రమేష్, బి శ్రీకాంత్, బి శివ, బీ రాకేష్, సిహెచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**అల్వాల్‌లో**
**అల్వాల్, మే 22 ప్రభాతవార్త:** అల్వాల్‌లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.. హనుమాన్ ఆలయాలు భక్తులుతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అన్నదానాలు పలు ప్రదేశాలులో నిర్వహించారు. శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఉప ఆలయం మహావీర్ హనుమాన్ ఆలయంలో పూజలుతో పాటుగా తీర్థ ప్రసాదాలు అందించారు. వెస్ట్ వెంకటాపురంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం 108 కలశాలుతో అభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, లక్ష తమలపాకులుతో ప్రత్యేక అర్చన, ద్వజారోహణము అనంతరం అన్నదానం తదితర కార్యక్రమాలు జరిగాయి.

**వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో**
**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల ఆధ్వర్యంలో జరిగింది. ఆలయాన్ని మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ సీనియర్ నేత ఎ.వినయ్‌కుమార్ తదితరులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం పూర్ణాహుతి, అనంతరం హనుమత్ లక్ష్మణ సమేత శ్రీ సీతారామచంద్రస్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింధూరాభిషేకం, పంచామృతాభిషేకం, వడమాల పూజలు నిర్వహించారు. అనంతరం అర్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 11సార్లు హనుమాన్ ఛాలీసా పారాయణాలు నిర్వహించారు. ఆలయం అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.కాగా మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్ స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించి పూజలు నిర్వహించారు.


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి ఆలయంలో...**


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రావడం కనిపించింది. ఈసందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, సింధూరాభిషేకం, అర్చనాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి స్వామివారికి శతకలశాభిషేకం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి ఎం.అంజన్‌కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్, ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, ఈవో లక్ష్మారెడ్డి, ఆలయం ప్రధాన అర్చకులు కాశీనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారుల క్రేజ్‌ని క్యాష్ చేసుకున్న మణికొండ ఆర్టీఏ అధికారులు

### - ఫ్యాన్సీ నెంబర్లతో రూ.46.లక్షలు ఆర్జించిన ఆర్టీఏ

**నార్సింగి, మే 22 ప్రభాతవార్త :** వాహనదారుల ఫ్యాన్సీ నెంబర్ల "క్రేజీని" మణికొండ ఆర్టీఏ అధికారులు "క్యాష్" చేసుకున్నారు. కేవలం ఫ్యాన్సీ నెంబర్ల వేలంతోనే గురువారం ఒక్కరోజు రూ.46.లక్షల ఆదాయాన్ని రాబట్టారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా డిటిసి సదానందం మాట్లాడుతూ ఫ్యాన్సీ నెంబర్ల ద్వారా ఆర్టీఏకు గణనీయమైన ఆదాయం వస్తుందని వివరించారు. ప్రతీనెలా ఫ్యాన్సీ నెంబర్ల వేలంను ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నామని, వాహనదారుల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు కొత్తదైనా, రెన్యూవల్ అయినా, వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ ఇలా ఏ పని ఉన్నా నేరుగా ఆర్టీఏ కార్యాలయానికి వచ్చి ప్రభుత్వం సూచించిన ఫీజును మాత్రమే చెల్లించి చేయించుకోవాలని తెలిపారు. ఆర్టీఏ కార్యాలయం బయట దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. దళారుల ద్వారా వస్తే పనులు త్వరగా అవుతాయని అనుకోవడం అపోహమాత్రమేనని, నేరుగా ఆర్టీఏ కార్యాలయంకు వచ్చి మీ పని చేయించుకునే ప్రయత్నం చేయాలన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకే అన్ని సేవలను ఆన్‌లైన్ చేయడం జరిగిందని డిటిసి సదానందం వివరించారు. గురువారం వేలం పాటలో టిజి 07ఎఎ9999 నెంబర్‌ను రూ.15,01,999కు సోఫుష్ ఇన్‌ఫ్రా ఎల్ఎల్‌పి, టిజి 07ఎబి0009 నెంబర్‌ను రూ.8,10,000లకు ఎపిటోమ్ ప్రాజెక్ట్స్ ఎల్ఎల్‌పి, టిజి07ఎబి0001 నెంబర్‌ను రూ.2,00,116కు ఆకుల సుప్రియ రాణి, టిజి 07ఎబి 0099 నెంబర్‌ను రూ.2,75,799కు లీడ్ స్పేస్, టిజి 07ఎబి 0006 నెంబర్‌ను రూ.1,65,530కు ఎర్రగుడ్ల ప్రణీత్, టిజి07ఎబి0111 నెంబర్‌ను రూ.1,55,555కు శిరీష్‌కుమార్ రెడ్డి దక్కించుకున్నారు. గురువారం జరిగిన వాహనాల ఫ్యాన్సీ నెంబర్ల వేలం పాటలో రూ.46. లక్షల ఆదాయం వచ్చిందని డిటిసి సదానందం వివరించారు.

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత

**శేరిలింగంపల్లి, మే 22 ప్రభాతవార్త**

మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛనుప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన జైబాపు,జైభీమ్, జైసంవిధాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జైబాపు,జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి, గ్రేటర్ హైదరాబాద్ స్టాడింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో చందానగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్,రంగారెడ్డి జిల్లా మహిళా డీసీసీ అధ్యక్షురాల జ్యోతిభీమ్ భరత్,జైబాపు,జైభీమ్, జైసంవిధాన్ అబ్జర్వర్ రమేశ్ గుప్త,కాంగ్రెస్‌పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఏఐసీసీ తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుట్ట అమిత్ రెడ్డి నేతృత్వంలో జైబాపు,జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి నియోజక వర్గంలో ఘనంగా ప్రారంభించారు. అహింసా పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిదర్శంగా నిలిచి స్వాతంత్రం సిద్దింపజేసిన మహాత్మాగాంధీతో పాటు ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగం రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్లను బీజేపి,ఆర్ఎస్ఎస్ అవమాన పరుస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమన్నారు. మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించటానికి కాంగ్రెస్ అధినేత,లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జైబాపు,జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్లా సంజీవ్‌రెడ్డి, శేరిలింగంపల్లి మైనార్టీ చైర్మన్ అజీం,మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, నియోజక వర్గ నాయకులు మహిపాల్‌యాదవ్, మిరియాల రాఘవరావు, లక్ష్మీనారాయణగౌడ్,వీరేందర్‌గౌడ్,కట్ల శేఖర్‌రెడ్డి, ఉరిటి వెంకట్రావు, డివిజన్ అధ్యక్షులు అలీ,బాష్ఫక్,యాదగిరి, మారేలా శ్రీనివాస్, జహంగీర్,డీసీపీ ఉపాధ్యక్షులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, రంగారెడ్డిజిల్లా ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్,విక్రమ్, పట్వారీ, శశిధర్,యలమంచి ఉదయ్‌కిరణ్,జావీద్, గౌస్,రామచందర్, కిట్టు,సంగమేశ్, మునాఫ్ ఖాన్, రాము, రహ్మాన్, ఆయాజ్‌ఖాన్,యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీహరిగౌడ్, నితిన్ గౌడ్,నరేందర్ ముదిరాజ్,దుర్గేశ్,ప్రవీన్, నందు, శేరిలింగంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక,బ్లాక్ ప్రెసిడెంట్లు బాగ్యలక్ష్మీ, శ్రీదేవి,పార్వతి,లక్ష్మీ, జయ,సుస్మిత, కవిత, శాంత, లలిత,దివ్య, అరుణయాదవ్, కృష్ణకుమారి, కృష్ణవేణి, లక్ష్మీదేవి, మేరి లోకేశ్వరి,నాగలక్ష్మీ,యోగేశ్వరి,అనిత పాల్గొన్నారు.


జైబాపు,జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## సైదారెడ్డి 12గంటల నిర్విరామగానంతో ప్రతిష్టాత్మక రికార్డులు

**నాంపల్లి, మే 22 ప్రభాతవార్త :** ఆణిముత్యాల్లాంటి 120 సుమధుర సినీగేతాలను 12గంటలపాటు నిర్విరామంగా ఆలపించి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకొని తన్మయుల్ని చేసిన ప్రముఖ గాయకుడు డి.సైదారెడ్డి ప్రతిష్టాత్మక వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తోపాటు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డును కైవసం చేసుకున్నారు. ఎస్ఆర్ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో సీజన్ 7 శీర్షికన నిర్వహించిన వైవిధ్యభరిత సంగీత విభావరిలో గాయకుడు సైదారెడ్డి ప్రఖ్యాత సంగీత దర్శకులు ఎ.ఆర్. రెహమాన్, ఇళయరాజా, దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకత్వంలో వెలువడిన 40 పాటలచొప్పున మొత్తం 120 పాటలతో గానమాధ్యుర్యాన్ని అందించి గొప్ప సంగీత ప్రతిభను చాటుకున్నారు. ఈ సంగీత విభావరిలో వర్తమాన గాయకులు రుద్రరెడ్డి, ఆనంద్, ఆడమ్స్, విజయేందర్‌రెడ్డి, మహేంద్ర, అర్జున్, దేవేందర్‌గౌడ్, గిరిధర్, కావ్యరెడ్డి, మధురవాణి, ప్రశాంతి, రాగరేఖ, రజని, రమ్యారెడ్డి, రాధారెడ్డిచ మీనాక్షి, నిర్మల తదితరులు సహకారం అందించి సంగీత విభావరిని మరింత రక్తికట్టించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ప్రిన్సిపాల్ పి.మధుకర్ స్వామి, రికార్డ్స్ కోఆర్డినేటర్లు బింగి నరేందర్‌గౌడ్, రవికుమార్, డా. టి.వి.అశోక్, ఫిల్మ్ సెన్సార్‌బోర్డు మాజీ సభ్యుడు వంశీరామరాజు తదితరులు పాల్గొని గాయకుడు సైదారెడ్డిని ఘనంగా సత్కరించి రికార్డ్స్ ప్రతిని, అవార్డును ప్రదానంచేసి ఇంత మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్ఆర్ మ్యూజికల్ బందాన్నీ ఎంతగానో అభినందించి సైదారెడ్డి ముస్ముందు తన మధురగానంతో ఆహుతులను మంత్రముగ్ధులను చేయాలని ఆకాంక్షించారు.



సైదారెడ్డిని సత్కరిస్తున్న మధుకర్‌స్వామి, నరేందర్‌గౌడ్, వంశీరామరాజు తదితర అతిథులు

## గానసభలో ఆంజనేయ స్వామి విగ్రహంకు పూజలు


పూజలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** త్యాగరాయ గానసభ ప్రాంగణంలో కొలువైన భారీ ఆంజనేయ స్వామి విగ్రహంకు గురువారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రముఖ పురోహితుడు వీణాపాణి శాస్త్రి నేతృత్వంలో పూజాదికాలు జరిపారు. అనంతరం భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి పాల్గొన్నారు.

## సంఘసంస్కరణల ఉద్యమ నాయకుడు భాగ్యరెడ్డివర్మ



**రవీంద్రభారతి, మే 22 ప్రభాతవార్త :** తెలంగాణ గడ్డమీద పుట్టి మాణిక్యాలవలె విరాజిల్లుతున్న మహనీయుల్లో ఒకరైన భాగ్యరెడ్డివర్మ ఆయన పుట్టింది అతిసామాన్య నిరుపేద కుటుంబమైనా సంఘసంస్కరణ, నిరంతర సామాజిక సేవ ద్వారా అత్యుత్తమస్థానం సంపాదించుకొన్న ఉద్యమ నాయకుడని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి కొనియాడారు. భాగ్యరెడ్డివర్మ 137వ జయంతిని పురస్కరించుకొని సాయంత్రం రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లో సాహిత్య అకాడమీ కార్యాలయంలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఘననివాళులర్పించి మాట్లాడారు. ఒకనాటి మాదిరి భాగయ్య కాలక్రమేణా భాగ్యరెడ్డివర్మగా సమాజంలో ఎఆ పిలువబడ్డారో ఆయన చరిత్ర చదివితే అర్థమౌతుందని సూచించారు. ఆయన దళిత జనోద్ధారకుడుగా, సంఘసంస్కరణల ఉద్యమ నాయకుడుగా, పత్రికా సంపాదకుడుగా, అనర్గళ వక్తగా, అన్నింటికీమించి గొప్ప మానవతావాదిగా బహుముఖ ప్రతిభ కనబరిచారని తెలిపారు. భాగ్యరెడ్డివర్మ హైదరాబాద్ నగరంలో జన్మించడం నగరవాసులకు గర్వకారణం, అదృష్టమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సిబ్బంది తోపాటు పలువురు సాహితీవేత్తలు పాల్గొని భాగ్యరెడ్డి వర్మకు ఘననివాళులర్పించి ప్రసంగించారు.

## సామాజిక సంస్కరణల వాది రాజారామోహన్ రాయ్

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:**
నాడు హిందూ మతం లో వున్న ఎన్నో మూఢ ఆచారాల్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించిన రాజా రామ మోహన్ రాయ్ గొప్ప సామాజిక మత సంస్కర్త అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా రాజా రామమోహన్ రాయ్ యాది లో పేరిట సంస్మరణ సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ వివిధ దేశాలలో నాటి సామాజిక మత పరంగా వున్న పలు రుగ్మతలను రూపుమాపేందుకు పలువురు సంఘ సంస్కర్తలు ఆవిర్భావించారని, భారత దేశం లో తొలి గా రామ మోహన్ రాయ్ నాడు మత గ్రంధాలు పేరిట జరుగుతున్న అమానవీయ పరిస్థితులను ఎదురించి నిలిచిన విప్లవ కారుడు అని చెప్పారు. భర్త మరణిస్తే భార్యను భర్త శవం తో పాటు నిప్పుల్లో వేసే దుర్మార్గమైన ఆచారాన్ని రూపు మాపేందుకు బ్రిటిష్ పాలకులతో కలిసి చట్టం తీసుకు వచ్చారని వివరించారు. ఇందుకు కోపగించిన బ్రాహ్మణ సంఘాలు రామ మోహన్ రాయ్‌ని కుల బహిష్కరణ చేశారని గుర్తు చేశారు. ఖురాన్ గీత బైబిల్ అన్ని మత గ్రంథాల చదివి వాటి సారం గ్రహించి ఈశ్వరుడు ఒక్కడే అని చాటి బ్రహ్మ సమాజం స్థాపించి కుల మత విబేధాలు లేకుండా ఎందరినో సమాజంలో కలుపుకున్నారు అని చెప్పారు రచయిత్రి శైలజా మిత్ర మాట్లాడుతూ దేశం లో ఆంగ్ల భాష అవసరం గుర్తించి బ్రిటిష్ వారికి ఆంగ్ల భాష విద్యావిధానం కోసం సహకరించిన మేధావి రాజా రామ మోహన్ రాయ్ అని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సామాజిక కార్యకర్త పి ఎస్ అర్ మూర్తి పాల్గొన్నారు

## కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలని నిరసన


**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** కగార్ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఆదివాసీల జాతిపై జరుపుతున్న హననాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆనేక పౌర, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు గురువారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రోఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌పేరుతో గిరిజనులను, మావోయిస్టులను కాల్చిచంపడం హేయమైన చర్య అని వర్ణించారు. మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ప్రభుత్వ హత్యయేనని, ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వం హత్యలేనని, వీటిపైన సుప్రీంకోర్టు జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని, దండకారణ్యంలో మారణహోమాన్ని ఆపాలని, వందలాది మంది కేంద్ర పోలీసు బలగాలు కాల్పులు జరిపి, హత్యలు చేస్తుంటే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ప్రశంసలు కురిపించడం సిగ్గు చేటని విమర్శించారు. తక్షణమే కాల్పుల విరమణ జరిపి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, మావోస్టుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు నాగభూషణం, రాంబాబు, ముత్తయ్య, ఎన్.వేణుగోపాల్, సత్యనారాయణ, ఆంజనేయులు, శ్రీదేవి, సత్య, రాము పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న పౌర, ప్రజా సంఘాల నాయకులు

## వ్యాపార పోటీలుగా మారిన అందాల పోటీలు

**సైఫాబాద్, మే 22 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న అందాల పోటీలు వ్యాపార పోటీలుగా మారాయని పలువురు రచయితలు ఆరోపించారు. అందాల పోటీలు మంచిది కాదని, మహిళలను వ్యాపార వస్తువులుగా చూడరాదని, అడపడుచులను అవమానపరిచ నట్లేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'అందాల పోటీలు- వ్యాపార సాంస్కృతి' అనే అంశంపై జరిగిన సామాజిక సదస్సులో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, సంఘం అధ్యక్షుడు రంగాచారి, ప్రముఖ కవియిత్రి విమల తదితరులు మాట్లాడారు. దేశంలో ఎక్కడలేని విధంగా అందాల పోటీలు తెలంగాణ రాష్ట్రంలోనే జరుగుతున్నాయని, పాలకుల భుజస్కందాలపై అందాల పోటీలు నిర్వహిస్తున్నారని, రాష్ట్రంలో రైతులు, విద్య, వైద్యం తదితర ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటి గురించి పట్టించుకోకుండా పాలకులు అందాలపై పోటీ పడుతున్నారని విమర్శించారు.



సదస్సులో మాట్లాడుతున్న విమల

## చిత్తుగా కల్లు తాగించి నిలువుదోపిడీ
### -నిందితురాలు అరెస్టు, రిమాండ్

**చిక్కడపల్లి, మే 22 ప్రభాతవార్త:** చిక్కడపల్లి కల్లుకాంపౌండ్‌లో ఓ మహిళకు మరో మహిళ చిత్తుగా కల్లు తాగించి నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకెళ్లిన సంఘటనలో ఒకరికి చిక్కడపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ మహిళ నుంచి కొంత నగదు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశంలో స్థానిక డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ , ఎస్సై మౌనిక తెలిపిన వివరాలను తెలిపారు. ముషీరాబాద్ మహాత్మా నగర్ కాలనీ చెందిన సత్యమ్మ జిహెచ్ఎంసి లో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తుంది. తరచు చిక్కడపల్లి కల్లుకాంపౌండ్‌కు వచ్చి కల్లు సేవిస్తుంటోంది. ఇదే సమయంలో మల్లేపల్లి ధోబీ ఘాట్ అఫ్జల్ సాగర్‌కు చెందిన నిందితురాలు కొంతం సోనీ ( షహనాజ్ బేగం ) ఈనెల 17వ తేదీన బాధితురాలు సత్యమ్మను చిక్కడపల్లిలోని శ్రీ సాయి బార్ కు తీసుకెళ్లి కల్లు తాగించింది. చిత్తుగా కల్లు సేవించిన సత్యమ్మ మత్తు లోకి జారుకోగానే ఆమె వద్ద ఉన్న రూ.20వేల నగదు, మొబైల్ ఫోన్‌తో పాటు ఐదు గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలు, ఏటీఎం, ఈఎస్ఐ, ఇల్లు ,అల్మారి కీలను బలవంతంగా లాగేసుకుని ఆమెను మెహదీపట్నంలో వదిలిపెట్టింది. మత్తులోనుంచి తేరుకున్న అనంతరం సత్యమ్మ చిక్కడపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి నిందితురాలు కొంతం సోనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు నుంచి బంగారు ఆభరణాలను, రూ.5500 నగదును స్వాధీనం చేసుకుని, కాగా పోలీసులు అరెస్టు చేసిన నిందితురాలు సోనిపై పలు పోలీస్ స్టేషన్లో కేసులు ఉన్నట్లు తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే శ్రీగణేష్



3వ వార్డు బాలంరాయి శ్రీ కాళి దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త: ఆలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 3వ వార్డు బాలంరాయిలోని శ్రీ కాళి దుర్గాదేవి దేవాలయం 23వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి కృప కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకడంతో పాటు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు రాజేష్ యాదవ్, నరేష్, ఇటుక గోపి తదితరులు పాల్గొన్నారు.

### తక్షణమే పిసిలు అందజేసేందుకు కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట,మే 22 ప్రభాతవార్త: రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సంవత్సరాల తరబడి స్థానికంగా నివాసం ఉంటున్న నిరుపేద అర్హులైన లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని స్థానికులు గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్, బస్తీ నాయకులు రౌతు రాజయ్య, డి.బాబురావ్, చిన్న వీరయ్య, బాల నర్సింహ్మ,పాపా,కోటమ్మ,పద్మ, శివకుమార్ పాల్గొన్నారు.

## కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న కూన శ్రీశైలం గౌడ్, కూన శ్రీనివాస్ గౌడ్



కొండగట్టు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నిజాంపేట్, మే 22, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, కెకెఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్‌లు గురువారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టులో శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనల మధ్య శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ తన కుమారుడు కూన కృష్ణ గౌడ్ హనుమాన్ మాల విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం



రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న శాస్త్రవేత్తలు

దుండిగల్, మే 22, ప్రభాతవార్త

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం ఆద్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మండలం గాగిల్లాపూర్ గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోని వ్యవసాయ కళాశాల, రాజేంద్ర నగర్ నుండి శాస్త్రవేత్త డా. కె. శైలజ రైతులకు భూసార పరీక్షల ఉద్దేశ్యము, మట్టినమూనా పరీక్షల ఆవశ్యకత, వరిలో ప్రదాన ఏరువుల వినియోగం, డ్రమ్ సీడర్ పద్ధతిలో భూసారాన్ని కాపాడుకోవడం, సేంద్రియ ఎరువుల వాడకం, జీవన ఎరువుల ప్రాముఖ్యత అనే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డా. సి.హెచ్. శ్రీలత శాస్త్రవేత్త రైతు ఉత్పత్తిదారుల సంస్థ దాని అవశ్యకత, లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ క్యాక్రమానికి మండల వ్యవసాయ అధికారి యస్. యాదగిరి, మాజి రైతుబంధు అధికారి వై.ఎస్. రెడ్డి, గ్రామ రైతులు, శ్రీనివాస్‌రావు, దుర్గేష్, బి. నాగరాజ్, సి. నరేష్, మధు, రాజేంద్రనగర్ పి.హెడి విద్యార్థి జి.కావ్య, యమ్.బి.ఎ విద్యార్థి వి.సాహితి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం: కార్పొరేటర్



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, మే 22 ప్రభాతవార్త: ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సత్యసాయి ఎన్‌క్లేవ్‌లో 38 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులకు కార్పొరేటర్ శంఖుస్థాపన చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అన్నింటిని కల్పిస్తున్నామని సబిత అనీల్ కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు అనీల్ కిషోర్, సయ్యద్ మోసిన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## పెంటారెడ్డి నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



కాలనీ పర్యటనలో శాంతి శ్రీనివాస్ రెడ్డి

అల్వాల్, మే 22 ప్రభాతవార్త: ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించడం తన బాధ్యతని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పెంటారెడ్డి కాలనీలో కార్పొరేటర్ పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని స్థానికులు ఆమెను కోరారు. సమస్యకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటానని కాలనీ వాసులకు శాంతి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## ఊరిలో దేవాలయం బాగుంటే ప్రజలు సుభిక్షంగా ఉంటారు : ఎమ్మెల్యే కృష్ణారావు

కెపిహెచ్బి కాలనీ, మే 22, ప్రభాతవార్త

ఊరిలో దేవాలయం బాగుంటే ఆ ఊరి ప్రజలు సుభిక్షంగా ఉంటారని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్‌లోని అతి పురాతనమైన హనుమాన్ దేవాలయం శిథిలావస్థకు చేరడంతో సొంత నిధులతో గుడి మరమ్మత్తులు, ప్రహరీ గోడ నిర్మాణం ధ్వజస్తంభం ఏర్పాటుకు సంబంధించి గురువారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. అలాగే ఫిరోజ్‌గూడలోని ముఖద్వారం కొరకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ అత్యంత పురాతనమైన హనుమాన్ దేవాలయం ఈ విధంగా శిథిలావస్థకు చేరడంతో భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు దేవాలయం మరమ్మత్తులు చేసి ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నామని అలాగే ప్రహరీ గోడ నిర్మాణం కూడా పూర్తి చేస్తామని అన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత సొంత నిధులతో గ్రామస్తులు సహకారంతో అతి పురాతనమైన కూకట్పల్లి రామాలయం పునర్నిర్మించుకున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పురాతన దేవాలయాలకు తన వంతు సహాయం చేస్తూ భగవంతుడు



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నానని ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఒక ఊరిలో దేవాలయం బాగుంటే ఆ ఊరి ప్రజల సుభిక్షంగా ఉంటారని అందుకనే నిత్య పూజలతో దేవాలయాలు కళకళలాడితే సిరిసంపదలతో, సుఖ సౌఖ్యాలతో గ్రామాలు కలకలాడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పద్యరచనకు తెలుగుభాషపై సాధికారత అవసరం : ఆచార్య కొలకలూరి ఇనాక్

రవీంద్రభారతి, మే 22 ప్రభాతవార్త : తెలుగులో పద్యరచన చేయాలంటే తెలుగుభాషపై సాధికారత, వ్యాకరణంపట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొలకలూరి ఇనాక్ విశిష్ట అతిథులు అయాచితం శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే బి.రామారావు, కవి బీరం సుందరరావు, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి డా. లగడపాటి సంగయ్య రచించిన తెలుగుధీర శతకం, ఆంధ్ర రఘువంశం, పల్లె పట్నం కావ్యాలను ఆవిష్కరించి ప్రసంగించారు. తెలుగు ధీర శతకంలో తెలుగుజాతి పౌరుషం, స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగువారి ధీరత్వం సంగయ్య గొప్ప వర్ణనను



సంగయ్య రచనలను ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, ఓలేటి, రఘురామ్, శ్రీధర్ తదితర అతిథులు

ప్రశంసించారు. పల్లె పట్నం కావ్యం పల్లెల కాలుష్య రహిత పచ్చని వాతావరణం పట్టణాల్లో కాంక్రీట్ భవంతుల నడుమ ఉరుకుల పరుగుల జీవిత వాస్తవికతను పద్య రూపంలో వివరించారని పేర్కొన్నారు. సభకు రఘురామ్ స్వాగతం పలుకగా సంగయ్య పల్లెపట్నం కావ్యాన్ని లగడపాటి రమాదేవిని ఘనంగా సన్మానించి అంకితమిచ్చారు.

## అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయి : జంపనప్రతాప్



కంటోన్మెంట్ ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్

కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త: అమ్మవారిని వేడుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ శ్రీ కాళి దుర్గా దేవి ఆలయంలో గురువారం నిర్వహించిన గణపతి పూజా, కుంకుమార్చన, దుర్గాహోమం, తీర్థప్రసాద వితరణ వంటి పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరంలో వర్షాలు విస్తారంగా పడాలని, పాడిపంటలు భాగుండాలని,ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆర్.వివేకానంద, ఉమా మహేశ్వర్ రావ్, రమేష్, రాజేశ్ యాదవ్,ప్రదీప్, నాగేశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : బానుక నర్మధ



1వ వార్డు సౌజన్య కాలనీలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బానుక నర్మధ తదితరులు

కంటోన్మెంట్,మే 22 ప్రభాతవార్త:

మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ సహాయ సహకారాలతో కంటోన్మెంట్ అభివృద్ధికి,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. 1వ వార్డు సౌజన్య కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో చేపట్టనున్న బిటీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో కాలనీల అభివృద్ధికి రూ.3 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి, ప్రతినిధులు ఎస్.ఎల్.ఎన్. రెడ్డి, నరేందర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, రాయల కుమార్,శ్రీనివాస్ రెడ్డి,బిజెపి నాయకులు రాఖేశ్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, బి.ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖల చరవాణి నంబర్లు

నిజాంపేట్, మే 22, ప్రభాతవార్త

అత్యవసర సమయంలో విద్యుత్ అధికారుల సమాచారం కోసం ఫోన్ నెంబర్లను అధికారులు గురువారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసి) బచుపల్లి 8712472714, కంట్రోల్ రూమ్ కూకట్‌పల్లి 8712472721, కంట్రోల్ రూమ్ మేడ్చల్ 8712472559, మియాపూర్ 8712472695, ఏఈ బచుపల్లి 8712472697

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు..



శ్రీ హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న దృశ్యం

పేట్ బషీరాబాద్, మే 22, ప్రభాతవార్త

శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేస్1లో ఏర్పాటు చేసిన అన్నదానంలో ప్రెసిడెంట్ శ్యామ్ రావు, వైస్ ప్రెసిడెంట్ విట్టల్, జనరల్ సెక్రెటరీ, ఎల్ల గౌడ్ సత్యనారాయణ, ఆర్గనైజేషన్ సెక్రెటరీ రెసిడెంట్ వెల్ఫర్ అసోసియేషన్. బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సెక్రెటరీ గుమ్మడి మధుసూదన్ రాజు ముదిరాజ్, నరేందర్ రెడ్డి, శ్రీకాంత్, బాలమల్లేష్, గణేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవిద్యాశంకరభారతీ మహాస్వామిచే హరే శ్రీనివాస గ్రంథావిష్కరణ

నాంపల్లి, మే 22 ప్రభాతవార్త : కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో దూరదర్శన్ ఢిల్లీ పూర్వ అదనపు డైరెక్టర్ డా. రేవూరి అనంత పద్మనాభరావు సభాధ్యక్షతన ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామివారి కరకమలాల మీదుగా విశ్రాంత ఐఎఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి రచించిన అసాధ్యాలను సుసాధ్యాలు చేసిన అద్భుత సత్యాలహారం హరే శ్రీనివాస గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ మీడియాకు తెలిపారు. నేడు 23 శుక్రవారం రాత్రి 6గంటలకు జరిగే ప్రత్యేక కార్యక్రమంలో శ్రీ విద్యాశంకరభారతీ స్వామిజీ విశిష్ట అతిథులు ఎమ్మెలే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖల మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆచార్య శలాక రఘునాథశర్మ, ఎమెస్కో విజయకుమార్, నేషనల్ బుక్ ట్రస్టు ఆఫ్ ఇండియా పాలకవర్గ సభ్యుడు జి.వల్లీశ్వర్ గ్రంథ రచయిత డా. కె.వి.రమణాచారి తదితరులతో కలిసి హరే శ్రీనివాస గ్రంథాన్ని ఆవిష్కరించి అనుగ్రహ భాషణం కావిస్తారని వివరించారు. సభకు ముందు పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు బృందంచే అన్నమయ్య సంకీర్తనలు ఆలపించబడతాయని, అధిక సంఖ్యలో భక్తజన, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రఘురామ్ కోరారు.

### పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కెపిహెచ్‌బి కాలనీ, మే 22, ప్రభాతవార్త

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించవలసిందిగా కోరుతూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీలు జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో 10 ఏళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటోందనీ వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్‌తో పాటు కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఉప్పల్, మల్కాజ్గిరి, మేడ్చల్ ఇన్చార్జులు జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించవలసిందిగా కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

## వాటర్ వర్క్స్ ఎండికి బిజెపి నేతల వినతి



వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి ,మే 22 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని కాటేదాన్ సెక్షన్,మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్,అత్తాపూర్ డివిజన్‌కు సంబంధించిన పలు ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నందున వెంటనే భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాటేదాన్ సెక్షన్,మైలార్‌దేవ్ పల్లి సెక్షన్,అత్తాపూర్ డివిజన్‌కు సంబంధించిన పలు ప్రాం తాలలో పనులు జరగక పెండింగ్ పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,పనులు మంజూరు చేయాలని ఎండికి వివరించామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి వీలైనంత త్వరగా పనులు మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తానని హామి ఇచ్చారని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మొండ్ర కొమరయ్య, జయానంద్ రెడ్డి,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విమానాల్లో విహారం

కుత్బుల్లాపూర్, మే 22 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలలో విద్యనభ్యసించి ఎదిగిన బార్యాభర్తలు చాటిన ఘనత ఇది. బిటుబి అనే నినాదంతో బిక్కునూరు నుండి బెంగుళూరుకు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమమార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు విమానంలో తిప్పి సత్తాచాటితే తమకూ ఇలాంటి రాజయోగం దక్కుతుందనే ఆలోచనను కల్పించిన ఘటన ఇది. వివరాల్లోకి వెళితే.... జీడిమెట్ల పోలీసు సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డమల్లేశ్ తోపాటు ఆతడి శ్రీమతి సుశీల కెమిస్ట్రీ లెక్చరర్. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో చదివేవిద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కామారెడ్డి జిల్లా బిక్కునూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులను బిక్కునూరునుండి బెంగుళూరు అనేపథకాన్ని రూపొందించి బిక్కునూరు మండల పరిధిలో ఉత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులను ఎంపికచేశారు. ఆశ్చర్యకరంగా ఆరుగురు విద్యార్థుల్లో ఐదుగురు విద్యార్థినులే అత్యధికమార్కులు సాధించడం గమనార్హం . బిక్కునూరు నుండి బెంగుళూరుకు విమానంలో తీసుకువెళ్లి అక్కడి విశ్వేశ్వరయ్య విజ్ఞాన కేంద్రాన్ని, బెంగుళూరులోని వివిధ ముఖ్యమైన ప్రదేశాలను చూపించారు. బిక్కునూరు మండల పరిధిలో జెడ్‌పిహెచ్ఎస్ బాలుర నుండి ఇద్దరు, జెడ్‌పిహెచ్ఎస్ గర్ల్స్ నుండి ఇద్దరు, జెడ్‌పిహెచ్ఎస్ జంగంపల్లి పాఠశాల నుండి ఇద్దరిని ఎంపికచేసి తీసుకువెళ్లి విమానంలో విహార యాత్ర చేయించారు. ఈసందర్భంగా జీడిమెట్ల సర్కిల్ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేశ్, బార్య సుశీల ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ



ప్రభుత్వపాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బిక్కునూరు విద్యార్థులతో బెంగుళూరులో విహారయాత్ర చేస్తున్న జీడిమెట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆయన బార్య సుశీల

ప్రతిభకనబరిస్తే ఏస్థాయిలో గౌరవం దక్కుతుంతో బిక్కునూర్ టూ బెంగుళూరు పర్యటన గుర్తుండిపోతుందనే ఉద్దేశంతో ప్రోత్సహించినట్లు తెలిపారు. విద్యార్థులు సహస్ర, స్పందన, వంశిక, సహస్ర, నౌసేన్, మహేశ్‌లు ఎక్కువమార్కులు తీసుకున్న విద్యార్థులుగా బిక్కునూరు మండలంలోనే గుర్తింపు పొందిన విద్యార్థులు కావడం విశేషం, పోలీసువిధులు నిర్వర్తిస్తూనే క్రైమ్ ఫ్రీ ఇండియా అనే యూటూబ్ ఛానల్‌ను నడుపుతూ సమాజాన్ని చైతన్యపరుస్తున్నాడు. నేరాలఅదుపుకు ఎలాంటి మెళకువలు అవసరమనే అంశాలను తమ యూట్యూబ్ ఛానల్‌ద్వారా ప్రజల్లోకి వెళుతున్నాడు. సమాజశ్రేయస్సులో భాగంగా బిటుబి పథకంద్వారా విద్యార్థుల్లో చైతన్యం తెస్తున్న గడ్డంమల్లేశ్ తోపాటు బార్య సుశీల నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా వుందని పోలీసులు, ప్రజలు కోరుతున్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల నృత్యం

హైదరాబాద్ మే 22 ప్రభాతవార్త: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టిజిపిసిబి) ఆడిటోరియంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన కార్యక్రమం అందరిని అలరించింది. పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా టిజిపిసిబి ఆడిటోరియంలో జంట నగరాల నుండి పాఠశాల విద్యార్థులు చేసిన బృంద నృత్య ప్రదర్శనలు అందరిని అలరించింది. సముద్ర జీవులు, మానవులు, జంతువులు, పక్షుల జీవితంపై ప్లాస్టిక్ కాలుష్యపు వినాశకరమైన ప్రభావాన్ని శాస్త్రీయ నృత్యాలతో పాటు మళ్లీ మళ్లీ గుర్తుకు వచ్చేలా సమకాలీన నృత్య రూపాల ద్వారా తమ ప్రదర్శన ద్వారా నిరూపించారు. చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించ దానికి ఉత్సాహభరితమైన జానపద నృత్యాన్ని మరో బృందం ప్రదర్శించింది. మొక్కలు నాటడంతో ఆశ, పునరుద్ధరణకు ప్రతీకను, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన పెంచే లక్ష్యంతో ఆకర్షణీయమైన నృత్య ప్రదర్శనలతో ఆడిటోరియం ఉత్సాహభరితంగా సందేశాలతో ప్రతిధ్వనించింది. వాదన, సృజనాత్మకత, సమాజ చైతన్యానికి వేదికగా మార్చింది. ప్లాస్టిక్ వ్యర్థాల కాలుష్యం, గాలి, నీటి సంరక్షణ, మొక్కల పెంపకంను స్థిరమైన ప్రజా రవాణాపై ప్రోద్భలం చేయాలనే దృష్టితో, మన పర్యావరణాన్ని రక్షించాల్సిన అత్యవసర అవసరాన్ని గుర్తు చేశారు. అందరూ విద్యార్థులు



కళాకారులను సత్కరించిన దృశ్యం

కళను క్రియాశీలతతో కలిపే సామర్థ్యాన్ని చూసి ఆకర్షితులయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన బోర్డు అధికారులు యువతరంలో పర్యావరణ విలువలను పెంపొందించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా, జిల్లా సైన్స్ అధికారి సి. ధర్మేందర్, బోర్డు అధికారులు, ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించారు, విద్యార్థుల సృజనాత్మకత, అభిరుచిని ప్రశంసించారు.ప్రతి ప్రదర్శనకారుడికి భాగస్వామ్య ధృవీకరణ పత్రం లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సృజనాత్మకత, ప్రభావవంతమైన సందేశానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వబడుతుంది. ప్రతి ఒక్కరూ తమ పర్యావరణ పాదముద్రను తగ్గించుకునే దిశగా రోజువారీ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కార్యక్రమం ముగిసింది.పర్యావరణాన్ని రక్షించడం అనేది ఒక రోజు వ్యవహారం కాదు, జీవితకాల లక్ష్యం, ఈ యువ ప్రదర్శకారులు ఇప్పటికే ముందున్నారు.

## పేదోడి కంచంలో సన్నబియ్యం బువ్వ : జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి, మే 22 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ప్రతి నిరుపేద సన్నబియ్యంతో అన్నం తినాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణి ప్రారంభించారని శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందానగర్ డివిజన్ వేముకుంట బస్తీలో సన్నబియ్యం లబ్ధిదారులు బి.సునీత సుందర్ ఇంటికి రంగారెడ్డి జిల్లా మహిళా డీసీసీ అధ్యక్షురాల జ్యోతి భీమ్ భరత్ జైబాపు,జై భీమ్,జై సంవిదాన్ అబ్జర్వర్ రమేష్ గుప్త కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సన్నబియ్యంతో వండిన ఆహారాన్ని అందరితో కలిసి జగదీశ్వర్‌గౌడ్ సహపంక్తిగా భోజనం చేశారు. ఈ సందర్భ ంగా లబ్ధిదారులు కుటుంబ యోగా క్షేమాలు అడిగితెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబసభ్యురాలు సునీతను ఆరా తీశారు. దొడ్డుబియ్యం పంపిణీ చేసినపుడు అసలు తీసుకునేందుకే అశక్తి చూపేవాళ్లం కాదని, ఇంటిల్లిపాది సమాధానమిచ్చారు. సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగం ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణయేనని,అంతేకాకుండా సన్నాలను ప్రోత్సహిస్తూ రైతులకు క్వింటాళ్లకు 500 చొప్పున బోనస్ ఇచ్చి ప్రోత్సాహం ఇవ్వడంలో ప్రభుత్వం ముందు వరుసలో నిలిచిందని,గడిచిన సీజన్‌లో సన్నాలకు రూ.1,199 కోట్ల బోనస్‌ను రైతుల ఖాతాలో జమచేసిందన్నారు. దీంతో ప్రభుత్వ నిర్ణయాల పట్ల రైతులు ప్రజలు హర్షం



సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేస్తున్న కాంగ్రెస్ నేత జగదీశ్వర్‌గౌడ్, కార్యకర్తలు

వ్యక్తం చేస్తున్నారని అన్నారు. .ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్లా సంజీవ్‌రెడ్డి, శేరిలింగంపల్లి మైనార్టీ ఛైర్మన్ అజీం,మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, నియోజక వర్గ నాయకులు మహిపాల్‌యాదవ్, మిరియాల రాఘవరావు,వీరేందర్‌గౌడ్,కట్ల శేఖర్‌రెడ్డి, ఉరిటి వెంకట్రావు,డివిజన్ అధ్యక్షులు అలీ,బాష్పక్,యాదగిరి, మారేలా శ్రీనివాస్,జహంగీర్,డీసీపీ ఉపాధ్యక్షులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, రంగారెడ్డిజిల్లా ప్రదాన కార్యదర్శి అభిషేక్ గౌడ్,విక్రమ్, పట్వారీ,శశిధర్,యలమంచి ఉదయ్ కిరణ్,జావీద్, గౌస్,రామచందర్, కిట్టు,సంగమేశ్, మునాఫ్ ఖాన్, రాము, రహ్మాన్, ఆయాజ్‌ఖాన్,యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీహరిగౌడ్, నితిన్‌గౌడ్, నరేందర్ ముదిరాజ్, దుర్గేశ్,ప్రవీన్, నందు, శేరిలింగంపల్లి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక,బ్లాక్ ప్రెసిడెంట్లు బాగ్యలక్ష్మి, శ్రీదేవి, పార్వతి, లక్ష్మి, జయ, సుస్మిత, కవిత, శాంత, లలిత, దివ్య, అరుణయాదవ్, కృష్ణకుమారి, కృష్ణవేణి, లక్ష్మిదేవి, మేరి లోకేశ్వరి, నాగలక్ష్మి, యోగేశ్వరి, అనిత పాల్గొన్నారు.

## ఆర్టీసి డ్రైవర్‌పై దాడికి యత్నం

హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త

ఆర్టీసి బస్ డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడికి యత్నించాడు.. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మియాపూర్ ఆల్విన్ చౌరస్తా వద్ద ఆర్టీసి బస్ డ్రైవర్‌పై దాడికి యత్నించారు. కాచిగూడ నుంచి పటాన్ చెకుకు ఆర్టీసి సిటీ బస్సు వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. తన ట్రాన్స్‌పోర్టు ఆటోకు దారి ఇవ్వడంలేదంటూ బస్సును ఆపి డ్రైవర్ ఫోన్ లాక్కొని ఆటో డ్రైవర్ దాడికి యత్నించాడు. రన్నింగ్‌లో ఉన్న బస్సు ఎక్కి కిటికీ బయట నుంచి డ్రైవర్‌ను బస్సు డ్రైవ్ చేయనివ్వకుండా చెయ్యి పట్టుకుని ఆటో డ్రైవర్ తాళాలు లాగే ప్రయత్నం చేశాడు. బస్సులో ప్రయాణికులు ఉన్నారని కనీసం ఇంగిత జ్ఞానం కూడా లేకుండా ఆటో డ్రైవర్ ప్రవర్తించడంపై వీడియో చూసిన నెటిజన్లు మండిపడ్డారు. బస్సులోని ప్రయాణికుల చొరవతో వివాదం సద్దుమణిగింది. డ్యూటీలోని ఆర్టీసి ఉద్యోగులు, సిబ్బందిపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ ఎండి సజ్జనార్ ఇప్పటికే హెచ్చరించిన విషయం తెలిసిందే. తమ సిబ్బంది ఆత్మస్థైర్యాన్ని దెబ్బతిసే, మనోవే దనకు గురిచేసే ఇలాంటి దాడులను ఆర్టీసి ఏమాత్రం సహించబోదని, నిందితులపై చట్ట ప్రకారం శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## 25న ఉచిత కంటి శస్త్ర చికిత్సా శిబిరం

హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:

గ్రేటర్ హైదరాబాద్ వాసులకు ఉచిత కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సా శిబిరాన్ని ఈనెల 25న హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు యోగ క్షేత్రం వహ్మ్యహం ఛారిటీ ట్రస్ట్ సంస్థ వ్యవస్థాపకులు వారణాసి కృష్ణమూర్తి తెలిపారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి మరుసటి రోజు లిబర్టీలోని సాధూరామ్ కంటి ఆసుపత్రిలో నిర్వహించబడుతాయని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇతర వివరాలకు ఫోన్‌నెంబర్ 93460 12864ను సంప్రదించాలన్నారు.

IN THE COURT OF THE XIV ADDL CHIEF JUDGE CITY CIVIL COURT
AT: HYDERABAD
I.A. No. 806 of 2024
IN
O.S.No. 365 of 1015

Between:
1. Smt. Uma (Died) another .... Petitioner/Plaintiff No. 2
AND
Smt. Shareefunnissa & others .... Respondents/Defendants

To,
i) M.A. Fayaz S/o late M.A. Gaffar, Aged About 40 Years Occ: Business, R/o H.No. 16-9-522, Old Malakpet, Hyderabad. Respondent No. 3/ Defendant No.3
ii) Mohd Pasha S/o Mohd Abbas, aged about 65 years, Occ: Businees, R/o H.No. 173B-97, Chandra Nagar, Yakutpura, Hyderabad - 23. Respondent No.4/Defendant No.4
iii) Smt. A. Padma W/o A. Rajaiah, aged about 75 years, Occ: House wife, R/o H.No.8-2-310/A, Jubilee Hills, Hyderabad. Respondent No.7/Defendant No.7
iv) Abdul Rasheed S/o Mohmmed Ismail, aged about 79 years, Occ: Businees, R/o H.No. 20-7-641, Malled Taleem, Fathe Darwaza, Hyderabad. Respondent No.8/Defendant No.8
v) Shaik Awais Ahmed S/o Shaik Maqbool Ahmed, aged about 30 years, Occ: Businees, R/o H.No.10-2-348, Asif Nager, SBH Colony, Hyderadad. Respondent No.9/ Defendant No.9

Sir/Madam
Please Take Notice that the Petitioners above named, have filed above I.A. 806 of 2024 in OS No. 365 of 2015 against You and others seeking amendment of Plaint and Notices addressed you returned un served. Therefore As per orders of the Hon'ble court you all concerned are hereby directed to apper before the Hon'ble court on 10-6-2025 at 10.30 AM., With respect to the above Matter. Otherwise the matter will be decided in your absence.

(by the Order of the Court)
P. Ramchander
Advocate
Off: Flat No. B, 1st Floor,
Chiranjeevi apartments, Block No.I,
West Marreddpally, Secunderabad - 26.
Ph: No. 9246537118.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
డివిజన్-14, GHMC

నిట్ నెం: 11/E.E.14/GHMC/2025-26 తేది: 21.05.2025
పనిపేరు : GHMC, KZ డివిజన్-14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా మొత్తం రూ.లలో: 9.5. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ సమయం : బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 22.05.2025 ఉ.11.00గం. మరియు బిడ్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం : 23.05.2025 ఉ.11.00గం. అధికారి పేరు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్: www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, GHMC.
DIPR.NO.2282-PP/CL/ADVT/1/2025-26 తేది: 22.05.2025

## సిసి రోడ్డు ,భూగర్భ డ్రైనేజ పనులు ప్రారంభం



**మల్కాజిగిరి మే22,ప్రభాతవార్త :** హనుమత జయంతి శుభ రోజున శ్రీ భ్రమరాంబికానగర్, ఆనందబాగ్ అష్ట భుజ దేవి అమ్మవారి దేవాలయం వద్ద జి.హెచ్.ఎం.సి అధికారులు, స్థానికులతో కలిసి దాదాపు 59 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు మరియు భూగర్భ డ్రైనేజ్ పనులను మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... ప్రత్యేక అనుమతులతో వాటర్ వర్క్స్ నుండి కాకుండా జి.హెచ్.ఎం.సి నుండి భూగర్భ డ్రైనేజ్ నిధులు తీసుకొచ్చామని అన్నారు. ఇందుకు సహకరించిన మాజీ కమీషనర్ ఆలాంబర్తి గారికి శ్రవణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేసారు. ఈ కార్యక్రమం లో జి.హెచ్.ఎం.సి ఏ. ఈ నవీన్, రమేష్, గిరి కాలనీ వాసులు శ్రీనివాస్, సుధాకర్, అనంత్, నాని,నర్సింహా,రంగ నాథన్, లీలావతి, రవి,జైకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వినాయక లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం



శ్రీ శ్రీ వినాయక లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్, పప్పుల అంజిరెడ్డి, సుభాష్ నాయక్ తదితరులు

**మేడిపల్లి ,మే 22 ప్రభాతవార్త ;** ఉప్పల్ డిపోలో నూతనంగా ఏర్పాటైన శ్రీ శ్రీ వినాయక లారీ అసోసియేషన్ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మేయర్ అమర్ సింగ్ , దీప ప్రజ్వలన చేసి అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా మాజీ మేయర్ అమర్ మాట్లాడుతూ... లారీ డ్రైవర్లు , యజమానుల సంక్షేమానికి ఈ అసోసియేషన్ కృషి చేయాలని ఆకాంక్షించారు. రవాణా రంగంలో ఎదురయ్యే సమస్యలను పరి ష్కరించడంలోనూ, డ్రైవర్లకు అవసరమైనా సహాయ సహకారాలు అందించడంలోనూ ఈ సంస్థ కీలక పాత్ర పోషించాలని సూచిం చారు. లారీ అసోసియేషన్ ఏర్పాటుతో డ్రైవర్లకు మెరుగైన సదు పాయాలు కల్పించడంతో పాటు, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షుడు మాధవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరప్ప, సంఘం సభ్యులు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్ , కాంగ్రెస్ సీనియర్ నేతలు పప్పుల అంజి రెడ్డి, మహే ష్, బండారి రవీందర్ , వంగూరి పరమేష్, తదితర ప్రశాంత్ పాల్గొని అసోసియేషన్ సభ్యులను అభినందించారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



కాలనీల పర్యటిస్తున్నారు సుధీర్‌రెడ్డి

**ఎల్బీనగర్, మే 22 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధి పరుచుకున్న వర్షాలతో అధికారులు అప్రమత్తంగా కావాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. అన్ని శాఖల అధికారులు అప్రమ త్తంగా ఉండాలని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వర్షపు భావం ప్రాంతాలను గుర్తించి అక్కడ సిబ్బందిని నియమించి వర్షపునీరు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో ముంపు ప్రాంతాల్లో పర్యటించాలన్నా రు. న్యూ గడ్డిఅన్నారం మట్టుపక్కల ప్రాంతాల్లో స్థానిక కాలనీ వాసులతో పర్యటించి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు కూడా తమవంతు విధిగా జాగ్రత్త లు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## సమావేశాన్ని బహిష్కరించిన కాంగ్రెస్ నాయకులు


**మలక్ పేట్, మే 22, ప్రభాతవార్త:** మలక్ పేట నియోజకవర్గం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులకు సమాచారం ఇవ్వకపోవడంతో మలక్ పేట లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని బహిష్కరించడం జరిగిందని మూస రాంబాగ్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ గౌడ్, ఆజంపుర డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ సింగ్ , చావని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాహిద్ ఖాన్, ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ షకీల్, సైదాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్రమ్, హైదరాబాద్ నగర యువ సాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్ సింగ్, సాయి రామ్ లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా పార్టీ కార్యక్ర మాలు నిర్వహిస్తూ ఒంటెద్దు పోకడలను అనుసరిస్తున్నారని దీంతో సమావేశాన్ని బహిష్కరించడం జరిగిందని తెలిపారు.

## రామంతాపూర్‌లో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన



రామంతాపూర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్, మే 22 ప్రభాతవార్త :** రామంతాపూర్ శ్రీనగర్ కాలనీలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవం గా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశ్వీరచనం తీసుకున్నారు. ఆలయం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఆనందరావు, రాజమౌళి, పరివేద వెంకటేశ్వరరావు, యా దగిరిరెడ్డి, రామబ్రహ్మం, రాజుమల్లు, పిచ్చయ్య, బాలస్వామి, సందీప్, జంగారెడ్డి, పెంటయ్య, జలీల్‌పాషా, శ్రీకాంత్‌యాదవ్, నామ్ రాజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ముత్యాల జంగయ్య, సతీష్‌గౌడ్, భాస్కర్, శాగ శ్రీధర్, శంకర్, అరుణ్‌సాయి, సత్యనారాయణ, మల్లేష్, అంజయ్య, నరసింహారెడ్డి, శివ పాల్గొన్నారు.



బోడుప్పల్ బొల్లిగూడలో అభయ ఆంజనేయస్వామి టెంపుల్ లో మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ తదితరులు



ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



హరిహర క్షేత్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారిని సుందరంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



హనుమాన్ జయంతి సందర్భంగా ఐఎస్ సదన్‌లో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి



హనుమాన్ జయంతి సందర్భంగా సైదాబాద్‌లో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ



ఆర్కేపురం డివిజన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి పూజలో పాల్గొన్న భాస్కర్‌రెడ్డి, గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి, సురేందర్, రమేష్‌నేత



కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ బిజెపి కార్యాలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానం చేస్తున్న కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి, యశ్పాల్‌గౌడ్



ఉప్పల్ ఎన్‌జిఆర్‌ఐ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు



హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు



చిలుకానగర్ గుట్ట ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బిఆర్ఎస్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, నీలంరెడ్డి తదితరులు

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

## మలక్‌పేట్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం : ఇంచార్జ్ షేక్ అక్బర్

**మలక్‌పేట మే 22 ప్రభాతవార్త :** రానున్న ఎన్నికలలో మలక్పేట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని మలక్పేట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశాన్ని చంచల్ గూడ లోని ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్ పేట్ నియోజ కవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఐకమత్యంతో పని చేయాలని కోరారు. కార్యకర్తలను బలోపేతం చేస్తే పార్టీ పటిష్టమవుతుందని తెలిపారు. మలక్ పేట్ నియోజక వర్గంలో డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ అద్యక్షులను గుర్తించి త్వరలో నియమిస్తామని పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజ కవర్గానికి సంబంధించిన విషయాలను పార్టీ పరిశీలకులు అధిష్టానానికి నివేదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమిస్తున్నా రని వివరించారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేసే వారికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గురించి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు సుబ్రహ్మణ్యం సురేష్ లు మాట్లాడుతూ ఏఐసీసీ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో పార్టీ సమావేశాలు నిర్వహి స్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం శ్రమించే నాయకులు, కార్య కర్తలకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి బో ల్లు కిషన్, నాయకులు బాబు శ్రీనివాస్, సోహెల్, గంట్ల కృష్ణ, జఫర్ ఇక్బాల్, ఆకుల రాజు, అశ్వఖ్ ఖాన్, మదన్ బాబు, శ్రీకాంత్, ధర్మేందర్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.





సమావేశంలో ప్రసంగిస్తున్న మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్

**తార్నాక, మే 22 ప్రభాతవార్త :** జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నేతలు కార్యకర్తలు పని చేయాలని నియో జకవర్గం ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ తార్నాక డివిజన్ నఫీజ్ ఫంక్షన్ హాల్ లో కంటేస్టేడ్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ అదం సంతోష్ కుమార్ అధ్యక్షతన గురు రువారం సాయంత్రం మెట్టుగూడ. అడ్డ గుట్ట, తార్నాక డివిజన్ల ముఖ్య నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమీక్ష సమావేశం లాలాపేట్ నఫీజ్ గార్డెన్ ల్లో జరిగింది. మెట్టుగూడా, అడ్డగుట్ట, తార్నాక డివిజ న్ల ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ సిద్ధేశ్వ ర్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభు త్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి కాంగ్రె స్ శ్రేణులు వివరించాలని, అభివృద్ధి కార్యక్రమాలు, పథకా లపై అవగాహన కల్పించాలని, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలని పేర్కొన్నారు.అదం సంతోష్ మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసింది అని రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేస్తుంద న్నారు. ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని, ఒక క్షణం కూడా ఆలస్యం చేయకుండా జీహెచ్‌ఎంసీ ఎన్నికల రంగంలోకి దిగాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు సంతోష్ పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీలో విజయమే లక్ష్యంగా పని చేయాలని, అందుకు పార్టీ కార్య కర్తలు కీలకమని స్పష్టం చేశాడు.ఈ కార్యక్రమంలో డివిజ న్ అధ్యక్షులు బ్రహ్మాజీ, రవి, గంటరాజు, అమర్నాథ్ గౌడ్, కిషోర్ యాదవ్, శిల్పా చారి, గుంటి కృష్ణ, రమేష్, హరి, పర్వేజ్, శేఖర్, శశాంక్, బెన్నా, నిస్సార్, బాబా, అశోక్, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్,ఎమ్మెల్సీ తధితరులు

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభించకపోతే నిరవధిక నిరాహార దీక్షలు చేస్తాం

**వనస్థలిపురం. మే.22.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్‌లోని శివారు కాలనీలకు సంబంధించిన డ్రైనేజీ పైప్ లైన్ల నిర్మాణానికి సంబంధించి అన్ని ప్రభుత్వ విభాగాల నుండి,రైతుల నుండి అనుమతులు వచ్చినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించడం లేదని బృందావన్ మేడోస్ కాలనీ, శ్రీనివాస్ కాలనీ,సౌభాగ్య నగర్ తదితర కాలనీల ప్రతిని ధులు ప్రశ్నిస్తున్నారు. మేము ఏ రాజకీయ పార్టీల కు వ్యతి రేకం కాదని, రాజకీయ పార్టీల తో తమకు సంబంధం లేదని ,శివారు కాలనీల అభివృద్ధే తమకు ముఖ్యమన్నారు. డ్రైనేజీ పైపులైన్ ల నిర్మాణానికి సంబంధించి యన్.వి. సి.లు రావడంతో సంబంధిత అధికారులు డ్రైనేజీ పైప్ లైన్ల నిర్మాణానికి పైపులు దింపి నెలరోజులు కావస్తున్నదన్నారు. అయినప్పటికీ పనులు మొదలవ్వడం లేదని, ఏ రాజకీయ నాయకులు అడ్డుకుంటున్నారో తమకు అర్థంకావటం లేద న్నారు. శుక్రవారం పనులు ప్రారంభం కాకపోతే శనివారం నుండి వైష్ణవి మెడికల్ హాల్ వద్ద నిరవధిక నిరాహారదీక్ష లు చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో శివారు కాలనీల ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు పి. శశి కాంత్,చిత్తరంజన్, నందకిషోర్, సరస్వతి, వేణు, ప్రభాకర్ ,జగన్,సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపుల వద్ద విలేకరుల సమావేశంలో శివారు కాలనీల ప్రతినిధులు.

## చంపాపేట చౌరస్తాలో దుకాణాల్లోకి చేరిన వరదనీరు

**సైదాబాద్, మే 22 ప్రభాతవార్త:** బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చంపాపేట చౌరస్తాలో సెల్లార్‌లోని నాలుగు దుకా ణాల్లోకి వరదనీరు చేరింది. దీంతో ఆయా దుకాణాల్లోని సామాగ్రి మొత్తం వరదనీటిలో మునిగి పాడయ్యాయి. లాప్ ట్యాప్‌లు, కంప్యూటర్ సిపియు, మానిటర్‌లు వరదనీటిలో మునిగి పాడయ్యాయి. ఫోటో స్టూడియో, ఆప్టికల్ షాపు, రబ్బర్ స్టాంపుల తయారీ దుకాణం, జ్యూస్ సెంటర్‌కు చెం దిన స్టోర్ రూంలోకి వరదనీరు భారీగా చేరడంతో దుకాణా ల్లోని సామాగ్రి మొత్తం పాడవడంతో ప్రభుత్వం తమను ఆదుకోవాలని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎమ్మెల్యే సందర్శన..**

వరదనీటిలో మునిగిన దుకాణాలను ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సందర్శించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ వరదనీటి వల్ల సామాగ్రి పాడవడంతో జరిగిన ఆస్థి నష్టం గురించి ఎమ్మార్వో దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని అన్నారు.



వరదనీటిలో మునిగి పాడైన లాప్‌టాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**కొత్తగా నిర్మించిన డివైడర్ వల్లే..**

కొంత కాలం క్రితం డిమార్ట్ ఎదురుగా రోడ్డు మధ్యలో కొత్త గా నిర్మించిన డివైడర్ వల్లే తమ దుకాణాల్లోకి వరదనీరు వచ్చిందని బాధితులు వాపోయారు. వర్షం పడినప్పుడు గతంలో డివైడర్ లేకపోవడంతో రోడ్డుకు మరో వైపు వరదనీ రు ప్రవహించేదని, అక్కడ నుంచి రెడ్డి కాలనీ మీదుగా కిందకు వరదనీటి ప్రవాహం వెళ్లేదని, అయితే కొత్తగా ని ర్మించిన రోడ్డు డివైడర్ వరదనీటి ప్రవాహానికి అడ్డుగా ఉండ డంతో తమ దుకాణాల్లోకి వరదనీరు చేరిందని వారు ఆవేద న వ్యక్తం చేశారు. డివైడర్‌ను నిర్మించేటప్పుడే తాము ట్రాఫి క్ పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లినా వారు పట్టించుకోలేదని వాపోయారు.

## ఎస్.కె.డి. నగర్‌కు మంజూరైన నిధులు కార్పొరేటర్ ఇంటివద్ద ఎలా వేసుకుంటారు : అరవింద్ రెడ్డి

**వనస్థలిపురం. మే.22.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి. నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ కృష్ణదేవరాయ నగర్ లో డ్రైనేజీ పైపులైన్ ల నిర్మాణం కోసం ఎల్.బి.నగర్ ఎమ్మె ల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నిధులు మంజూరు చేయిం చడం జరిగిందని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ బి.ఆర్. యస్.అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి తెలిపారు. అట్టి పనులను వాటర్ వర్క్స్ అధికారులు మార్చి 19న పనులు ప్రారంభించి,50 అడుగులు డ్రైనేజీ లైన్ తవ్వు తుండగా స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నేను కొబ్బరికాయ కొట్టకుండా పనులు ఎలా చేస్తారని అధికా రులను బెదిరించి పనులు ఆపించడం జరిగిందని అర వింద్ రెడ్డి ఆరోపించారు. పనులు ఆపి రెండు నెలలు కావస్తున్నదని,పనులు ప్రారంభించకుండా, ఎమ్మెల్యే శ్రీ కృష్ణదేవరాయ నగర్‌కు మంజూరు చేయించిన డ్రైనేజీ ప నులను కార్పొరేటర్ తన ఇంటి వేయించుకోవడం సిగ్గు చే టని విమర్శించారు. అభివృద్ధి పనుల విషయం లో రాజకీ యం తగదన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో హనుమాన్ జయంతి



పూజలు నిర్వహిస్తున్న నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు

**సైదాబాద్, మే 22 ప్రభాతవార్త:** వైశాఖ బహుళ దశమి ని పురస్కరించుకుని గురువారం కర్మన్‌ఘాట్ హనుమా న్ దేవస్థానంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక సింధూర అభిషేకము, ఆకుపూజలు, అర్చనలు, మన్యుసూక్త హోమము నిర్వ హించారు. సాయంత్రం పల్లకిసేవను నిర్వహించారు. దేవాలయ పాలక మండలి మాజీ చైర్మన్ నల్ల రఘు మారెడ్డి సుమిత దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టు కుని తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేసి, త్రాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాన్ని అందజేసినట్లు దేవాలయ కా ర్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య తెలిపారు. ఈ కార్య క్రమంలో పాలకమండలి మాజీ ధర్మకర్తలు మధుసాగర్, ముద్ద కళ్యాణ్, మల్లేష్‌గౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## కబ్జాదారులపై ఉక్కుపాదం : తహసీల్దార్ వాణిరెడ్డి





ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

**ఉప్పల్, మే 22 ప్రభాతవార్త :** ఉప్పల్ మండల పరిధి లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని తహసీల్దార్ టి.వాణిరెడ్డి పేర్కొన్నా రు. ఈ మేరకు ఉప్పల్ మండల పరిధిలోని హైకోర్టు కాలనీలోని సర్వేనెం.789/1లో ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. తహసీల్దార్ వాణిరెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఐ సామ్సన్‌పాల్, జూని యర్ అసిస్టెంట్ వెంకన్న, అలివేలు ఇతర అధికారులు ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వాణిరె డ్డి మాట్లాడుతూ హైకోర్టు కాలనీలోని ప్రభుత్వ స్థలం ఎవరైనా క్రయవిక్రయాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో బోర్డులు తొలగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాల రక్షణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





హయత్ నగర్‌లోని ఎస్ఎన్ఆర్ కళ కన్వెన్షన్‌లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

## ముంపు సమస్య త్వరలో పరిష్కరిస్తాం : కార్పొరేటర్



సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, మే 22 ప్రభాతవార్త :** తొమ్మిదినర సంవత్సర కాలంలో నాచారంలో దాదాపుగా అన్ని ముంపు ప్రాంతాలలో డ్రైనేజీలు ఏర్పాటు చేయడం జరిగిందని, వర్షపునీటి డ్రెయిన్లు ఏర్పాటు చేయడం జరిగిందని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని జాన్సన్ గ్రామర్ స్కూల్ వద్ద చిన్న వర్షానికి వచ్చిన మోకాలలోతో నీళ్లు నిలిచి ఉంటున్నాయని తెలిపారు. ఈ సమస్య పరిష్కరించడా నికి చాలా ప్రయత్నాలు చేయడం జరిగిందని, కానీ లెవెల్ సమ స్య వల్ల ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కానీ తొందరలోనే ఈ సమస్యకు పరిష్కారం దిశగా పనులు చేయి స్తామని సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈఈ. నాగేందర్,డిఈ, బాలకృష్ణ, ఏఈ కీర్తి వినీత్ వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ బారాస నాయకులు సాయి జన్ శేఖర్ భూపాల్ రెడ్డి మరియు రాంబాబు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ సంఘటితం కావాలి



హిందూ ఐక్యత శక్తి యాత్రను ప్రారంభిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సంఘటితం కావాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరా ములు యాదవ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బాలాపూ ర్ మండలం మామిడిపల్లి గ్రామంలో స్థానిక పంచముఖి ఆంజ నేయ స్వామి వ్యాయామశాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన హిందూ ఐక్య త శక్తి యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఆయన కాషాయ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులతో పాటు మద్ది రాజశేఖర్‌రెడ్డి, యాదగిరి, సతీష్‌గౌడ్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ చతుర్థ వార్షికోత్సవాలు



పంచముఖ ఆంజనేయ స్వామి చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా అలంకరణ చేసి పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి దంపతులు

**సరూర్‌నగర్, మే 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పెద్ద చెరువు కట్ట దిగువన టిఎస్‌ఆర్‌నగర్‌లో నున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ చతుర్థ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. పంచముఖ ఆంజనేయ స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో వార్షికో త్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉద యం ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు శత ఘటాభిషేకం, మణిసప్త హోమం, సాయంత్రం సామూహిక భజన కార్యక్రమా ల అనంతరం డ్రై ఫ్రూట్స్‌తో హనుమంతునికి అలంకరణ చేశారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉద యం బాలాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, పంచము ఖ ఆంజనేయునికి అలంకరణ, లక్ష తమలపాకులతో అర్చన, మహా హారతి జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కాగా పంచముఖ ఆంజనేయ స్వామ చతుర్థ వార్షికోత్సవాల సందర్భంగా స్థానిక మీర్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్ 28వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జిల్లెల అరు ణ ప్రభాకర్‌రెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమాల్లో వివిధ కాలనీ ప్రజలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.